# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **గత దశాబ్ద కాలంలో యువత సాధికారతకు కేంద్రప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ ఈ రోజు కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు.**

**3.** **విశాఖపట్నంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.**

**4.** **విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈ నెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

===========================

గత దశాబ్ద కాలంలో యువ సాధికారత కోసం కేంద్రప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. రోజ్ గార్ మేళాలో భాగంగా కేంద్రప్రభుత్వ విభాగాలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన వారికి దృశ్యమాధ్యమం ద్వారా నియమాక పత్రాలను ప్రధానమంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి యువత కేంద్రీకృత కార్యక్రమాలను చేపట్టిందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 32 సెకన్లు

---

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈ రోజు కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని పెనమలూరు నియోజకవర్గం, కంకిపాడు, రొయ్యూరులో పర్యటిస్తున్నారు. గొడవర్రు రోడ్డు పనులను పరిశీలించి పంచాయతీ రాజ్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడివాడ మండలంలోని మల్లయ్య పాలెంలో రక్షిత తాగు నీటి పథకానికి సంబంధించిన కార్యక్రమాలను పరిశీలిస్తారు. అదేవిధంగా పంచాయతీ రాజ్, వాటర్ వర్క్స్ అధికారులతో సమస్యల గురించి చర్చిస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వేగవంతం చేసేలా ఉపముఖ్యమంత్రి

పర్యటిస్తున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు కోరారు. విశాఖపట్నంలోని పోర్ట్ సాగరమాల ఆడిటోరియంలో ఈరోజు నిర్వహించిన రోజ్ గార్ మేళాలో 667 మందికి నియామకపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ,

వాయిస్...30 సెకన్లు

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో భవానీ దీక్ష విరమణలు మూడో రోజూ కొనసాగుతున్నాయి. భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులు హోమగుండం వద్ద నేతి కొబ్బరికాయలు సమర్పిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు దీక్షల విరమణలు కొనసాగనున్నాయి. దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని క్యూ లైన్లలో ఉచిత దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. దీనిలో భాగంగా రుసుము ద్వారా దర్శనం, ఆర్జిత సేవలను ఈ నెల 25వ తేదీ వరకు రద్దు చేశారు.

---------------------------

విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్నికలుగచేసే క్రీడలు అవసరమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-17, 18, 19 బాలబాలికల రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని అన్నారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రకాశం జిల్లాలో నిలిచిపోయిన క్రీడా మైదానాల నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

---------------------------

భారత మాజీ ప్రధానమంత్రి చౌదరీ చరణ్ సింగ్ జయంతిని ఈ రోజు జాతీయ రైతు దినోత్సవం లేదా కిసాన్ దివస్ నిర్వహిస్తున్నారు. దేశ ప్రధానమంత్రిగా చరణ్ సింగ్ పనిచేసింది కొద్ది కాలమే అయినప్పటికీ... వ్యవసాయ రంగాభివృద్ధికి ఆయన విశేషకృషి చేశారు. అన్నదాత మేలు కోసం ఎన్నో వ్యవసాయ చట్టాలను అమలులోకి తీసుకువచ్చారు. 1902 డిసెంబర్ 23వ తేదీన జన్మించిన చరణ్ సింగ్... ప్రధానమంత్రిగా పనిచేసిన సమయంలోనే జమిందారీ చట్టం రద్దయి.... కౌలుదారీ చట్టం అమలులోకి వచ్చింది. ఏడాదిలో ఒక్క రోజైనా వ్యవసాయ రంగంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కిసాన్ దివస్ ను జరుపుకోవడంలోని ప్రధాన అంశం.

---------------------------

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అమలాపురం శాసనసభ్యులు ఏ.ఆనందరావు తెలిపారు. అమలాపురంలో ఆయన పాత్రికేయులతో

మాట్లాడారు. జిల్లాలోని ఉప్పలగుప్తం మండలం తెల్ల ఇసుక ఉన్న ఎస్.యానం సముద్రతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని తెలుపుతూ…

…వాయిస్… 30 సెకన్లు

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది..“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-------------------------

ఢిల్లీలో వచ్చే నెల జనవరి 26వ తేదీన జరిగే గణతంత్ర దినోత్సవ కవాతులో ప్రదర్శనకు రాష్ట్రం నుండి చెక్కతో తయారుచేసే ఏటికొప్పాక బొమ్మల శకటం ఎంపికైందని అధికారులు తెలిపారు. తెలుగువారి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ శకటాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో ఏర్పాటుచేసిన శ్రీవేంకటేశ్వరస్వామి రూపం వినాయకుడి ప్రతిమ, హరిదాసు, బొమ్మలకొలువు, చిన్నారుల ఆటపాటలకు సంబంధించిన చిత్రాలు అందర్నీ ఆకట్టుకుంటాయని తెలిపారు.

-------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు సులభంగా వసతి పొందేలా అనేక చర్యలు చేపడుతున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. శ్యామలరావు తెలిపారు. తిరుమలలో ఆధునీకరించిన గరుడాద్రి ఉప విచారణ కేంద్రాన్ని అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్యచౌదరితో కలిసి ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామలరావు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్…29 సెకన్లు

-------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నెల 7 నుంచి మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం మార్చి 24కు వారం రోజుల ముందు ఈ ప్రచార కార్యక్రమం పూర్తికానుంది. ఇందులో ఉత్తమ ఫలితాలు కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది.

-------------------------

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పర్యటించి  ఫైబర్ కేబుల్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర ఫైబర్ నెట్ ఛైర్మన్ జి వెంకటరెడ్డి తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాల ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ కేబుల్ ఆపరేటర్లతో గన్నవరంలో ఈరోజు ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఏపీఫైబర్ నెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని  తెలిపారు.

======================